క్లుప్తంగా

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు ప్రతిభ



సబ్ జూనియర్స్ కబడ్డీ పోటీల్లో సెమీఫైనల్స్‌కు చేరిన ఉమ్మడి జిల్లా జట్టు

నల్లజర్ల: కడప జిల్లా పులివెందులలో ఈ నెల 14వ తేదీ నుంచి సబ్ జూనియర్స్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్టు ప్రతిభ కనబరిచి సెమీ ఫైనల్స్‌కు చేరినట్టు కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి వై.శ్రీకాంత్ తెలిపారు. తొలి రౌండ్‌లో గుంటూరు, కర్నూలు జట్లపై విజయం సాధించిన జిల్లా టీమ్ క్వార్టర్‌లో శ్రీకాకుళం జట్టుపై విజయం సాధించి సెమీఫైనల్స్‌కు చేరినట్టు కబడ్డీ కోచ్ జి.శ్రీకాంత్ వివరించారు.

ఘనంగా అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపన

చాగల్లు: బ్రాహ్మణగూడెంలో లక్ష్మీరాజరాజేశ్వరి, సరస్వతి అమ్మవార్ల ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గణపతి పూజ, వాస్తుపూజ, హోమాలు, లక్షణోద్ధారణ, క్షీరాభిషేకాలు చేశారు. సోమవారం అన్నసమారాధన జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

కోటసత్తెమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ తల్లిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకులు అప్పారావు శర్మ పర్యవేక్షణలో కోటసత్తెమ్మ అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోలు అమ్మకంతో రూ.1,40,796 ఆదాయం వచ్చినట్టు ఈఓ పేర్కొన్నారు. ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

207 మందికి వైద్య పరీక్షలు

తాళ్లపూడి: ప్రక్కిలంకలోని అశోక్ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ వద్ద ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యులు కె.అశోక్ కుమార్, అమూల్య, కిషోర్ 207 మందికి పరీక్షలు చేసి మందులు అందించారు. థైరాయిడ్, ఎముకల సాంద్రత, షుగర్, బీపీ, న్యూరోపతి, ఎక్స్‌రే, జనరల్, ఆర్థోపెడిక్ తదితర వాటిని పరీక్షించారు. ఈ వైద్య శిబిరంలో హస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

304 మందికి వైద్య పరీక్షలు

చాగల్లు: మార్కొండపాడు గ్రామంలో రాజమహేంద్రవరం ఆదర్శ మల్టీస్పెషాలిటీ హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. హాస్పటల్ వైద్యులు సుమారు 304 మంది రోగులను పరీక్షించారు. వైద్యశిబిరాన్ని ఎంపీపీ మట్టా వీరాస్వామి ప్రారంభించి రోగులకు మందులు పంపిణీ చేశారు. అనంతరం వైద్యులను సన్మానించారు. శిబిరం నిర్వాహకులు అల్లాడి బాలాజీ, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలింపుపై కొరడా



వాహనాలను సీజ్ చేసిన మైన్స్ ఏడీ ఫణిభూషణ్‌రెడ్డి

కొవ్వూరు: మట్టి తరలింపుపై మైన్స్ అధికారులు ఆదివారం కొరడా ఝుళిపించారు. దేచెర్ల రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 84లో కేవీఆర్ స్టోన్ క్రషర్స్ ఆధ్వర్యాన రోడ్డు మెటల్ అక్రమంగా తవ్వుతున్న రెండు టిప్పర్లు, మూడు కంప్రెసర్లను స్వాధీనం చేసుకున్నారు. వీటిని జిల్లా మైన్స్ శాఖ సహాయ సంచాలకుడు డి.ఫణిభూషణ్‌రెడ్డి ఆధ్వర్యాన సీజ్ చేసి, కొవ్వూరు రూరల్ పోలీసులకు అప్పగించారు. ఈ దాడుల్లో సర్వేయర్ శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు.

బెల్టు షాపులపై దాడులు

దేవరపల్లి: స్థానిక ప్రొహిబిషన్, ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం పరిధిలోని దేవరపల్లి, గోపాలపురం మండలాల్లో సీఐ బళ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బెల్టు దుకాణాలు, సారా దుకాణాలపై ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మద్యం అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. బెల్టు దుకాణాలు నిర్వహించినా, సారా విక్రయించినా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీనివాసరావు హెచ్చరించారు. బెల్టు దుకాణాలపై చేసిన దాడుల్లో 18 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఆయన తెలిపారు. దాడుల్లో ఎస్సై ఎవీవీ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- నేటి నుంచి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు
- నియోజకవర్గంలో రాయనున్న 1,642 మంది



నిడదవోలు పట్టణంలో సెయింట్ ఆన్స్ స్కూల్ పరీక్షా కేంద్రంలో నంబర్లు వేస్తున్న అధికారులు

మండలం	హైస్కూళ్లు	విద్యార్థులు
నిడదవోలు	12	721
ఉండ్రాజవరం	08	467
పెరవలి	07	454
మొత్తం	27	1,642

నిడదవోలు: విద్యార్థి జీవితంలో ఎంతో కీలకమైన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసేందుకు విద్యార్థులంతా సిద్ధంగా ఉన్నారు. పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఇందుకు విద్యాశాఖ ఆదేశాల మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 17వ తేదీనుంచి 31వ తేదీ వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. ఒక్కో పరీక్షా పరీక్షా కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారితో పాటు ఇన్విజిలేటర్లను నియమించారు. పోలీస్ బందోబస్తుతో పాటు ఆరోగ్య సిబ్బందిని నియమించారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు, మంచినీటి సదుపాయం కల్పించారు.

దేవరపల్లి మండలంలో..

దేవరపల్లి: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభం కానున్నాయని ఎంఈఓలు ఎం.తిరుమలదాస్, కేఆర్ఎస్‌వీవీ అప్పారావు ఆదివారం తెలిపారు. ఈ నెల 31వ తేదీ వరకూ పరీక్షలు జరుగుతాయన్నారు. మండలంలో ఏర్పాటు చేసిన ఐదు కేంద్రాల్లో 1,132 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, అన్ని ఏర్పాట్లూ చేశామని తిరుమలదాస్ తెలిపారు. పరీక్షల నిర్వహణకు చీఫ్ సూపరింటెండెంట్లను, ఐదుగురు విద్యా శాఖ అధికారులను, 59 మంది ఇన్విజిలేటర్లను నియమించామని చెప్పారు. అన్ని కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు అవసరమైన బల్లలు, మంచినీరు, టాయిలెట్లు, గదుల్లో ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేశామని వివరించారు. స్థానిక అంబటి సత్యనారాయణరావు జెడ్పీ హైస్కూలు కేంద్రంలో 208 మంది, శ్రీచైతన్య హైస్కూల్లో 207 మంది, భాష్యం హైస్కూలులో 202 మంది, చిన్నాయగూడెం జెడ్పీ హైస్కూలులో 229 మంది, యర్నగూడెం జెడ్పీ హైస్కూలులోని పరీక్ష కేంద్రంలో 286 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. విద్యార్థులు అరగంట ముందే పరీక్షా హాలులో ఉండాలని చెప్పారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ పరీక్షలు జరుగుతాయని తిరుమలదాస్ తెలిపారు.

తాళ్లపూడి: మండలంలో సోమవారం నుంచి జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతిరోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్ష నిర్వహిస్తారు. తాళ్లపూడి మండలంలో మూడు పరీక్షా కేంద్రాల్లో 765 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయనున్నారని ఎంఈవో-2, రూట్ ఆఫీసర్ సీహెచ్ నెహ్రూజీ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి 470 మంది, ప్రైవేట్ పాఠశాలల నుంచి 295 మంది హాజరవుతున్నారు. తాళ్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 210 మంది, వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 260 మంది, మలకపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 150 మంది, బి కేంద్రంలో 145 మంది పరీక్షలు రాయనున్నారు. విద్యార్థులకు తాగునీరు, ఫర్నిచర్ అన్నింటిని ఏర్పాటు చేసి పకడ్బందీగా పరీక్షలు నిర్వహించారు. ఛీఫ్ సూపరిటెండెంట్‌లుగా జె.ప్రభాకర్, శ్రీవాసవి, సీహెచ్‌నాగేంద్రరావు, సీహెచ్‌సుబ్బలక్ష్మి, డిపార్టమెంటల్ ఆఫీసర్లుగా బి సత్యనారాయణ, డి.జయరాజ్, కె.రాధిక, మోహన్ వ్యహరించన్నుట్టు తెలిపారు.



టెన్త్ పరీక్షల వివరాలను వివరిస్తున్న ఎంఈఓలు తిరుమలదాస్, అప్పారావు

చాగల్లు మండలంలో మూడు పరీక్ష కేంద్రాలు

చాగల్లు: మండలంలో చాగల్లు, ఊనగట్ల, మార్కొండపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరగనున్న పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ యు.గురునాథం ఆదివారం తెలిపారు. మండల పరిధిలోని 14 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 597 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని ఆయన చెప్పారు.

గోపాలపురం: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభం కానున్నాయని, దీనికి మండలంలో అన్ని ఏర్పాట్లూ చేశామని ఎంఈఓ జి.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం నాలుగు కేంద్రాల్లో 956 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతారన్నారు. వేళ్లచింతలగూడెం సెయింట్ జోసెఫ్ పాఠశాలలో 280, దొండపూడి సెయింట్ మేరీస్ పాఠశాలలో 150, రాజంపాలెం జెడ్పీ హైస్కూలులో 176, గోపాలపురం జెడ్పీ హైస్కూల్లో 350 మంది చొప్పున విద్యార్థులు హాజరవుతారని ఎంఈఓ వివరించారు.

పది పబ్లిక్ పరీక్షల నిబంధనలు ఇలా..

నిడదవోలు: పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఉదయం 9.30 గంటల నుంచి నిర్వహిస్తారు.

- పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144వ సెక్షన్ అమలవుతోంది. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలి.
- విద్యార్థులను ఉదయం 9 గంటల నుంచి పరీక్షా కేంద్రంలోనికి అనుమతిస్తారు.
- సరైన కారణం ఉన్నట్లయితేనే ఆలస్యంగా వచ్చిన వారిని 9.30 నుంచి 10 గంటల వరకు అనుమతిస్తారు. 10 గంటల తరువాత పరీక్షా కేంద్రం లోపలికి రానివ్వరు.
- పరీక్ష కేంద్రానికి విద్యార్థులు హాల్ టికెట్, పెన్నులు, ప్యాడ్స్ తీసుకుని రావాల్సి ఉంటుంది.
- పరీక్ష కేంద్రంలో మొబైల్ ఫోన్, ఇతర మెటీరియల్ తీసుకుని రాకూడదు.
- విద్యార్థులు స్కూల్ యూనిఫాం కాకుండా సాధారణ దుస్తులను ధరించి పరీక్షకు హాజరుకావచ్చు.
- పరీక్ష కేంద్రాల ప్రవేశ ద్వారం వద్ద విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలకు అనుమతిస్తారు.
- పరీక్ష కేంద్రంలో వైద్య సిబ్బంది, అత్యవసర మందులతో అందుబాటులో ఉంటారు.
- విద్యార్థులకు ఏ సందేహం వచ్చినా పరీక్ష కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ ఆఫీసర్, ఇన్విజిలేటర్‌ను సంప్రదించవచ్చు.
- మొదటి రోజు హాల్ టికెట్ నంబర్‌ను అనుసరించి కేటాయించిన తరగతి గదిని తెలుసుకోవాలి.
- పరీక్ష బార్ కోడ్ విధానంలో జరుగుతుంది. సీరియల్ నంబరు కలిగిన మెయిన్ బుక్ లెట్‌కు (24 పేజీలు/12 పేజీలు) జతపరచి స్టికర్ ద్వారా సీల్ చేసి ఇస్తారు. మీకు ఇచ్చిన బుక్‌లెట్‌లో వివరాలను విద్యార్థులు పరిశీలించుకోవాలి. అదనంగా సమాధాన పత్రం అవసరమైతే 12 పేజీల బుక్‌లెట్‌ను తీసుకోవాలి.
- మెయిన్ బుక్ లెట్, అదనపు బుక్ లెట్, మ్యాప్, గ్రాఫ్‌లపై హాల్ టికెట్ నంబర్ గానీ, మీ పేరు గానీ ఎక్కడా రాయకూడదు. అదనపు బుక్ లెట్, గ్రాఫ్, మ్యాప్‌లపై మీ మెయిన్ బుక్ లెట్ నంబరును నమోదు చేయాలి. అన్నింటిపై ఇన్విజిలేటర్ సంతకం పొందాలి. చివరగా అన్నింటినీ థ్రెడ్‌తో గట్టిగా కట్టి ఇవ్వాలి.

కన్నబాబును కలిసిన కాపు సంఘం నాయకులు



కాకినాడలో కురసాల కన్న బాబును అభినందనలు తెలుపుతున్న నాయకులు

తాళ్లపూడి: వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కోర్డినేటర్ కురసాల కన్న బాబును కాకినాడలో ఆదివారం వైఎస్సార్ సీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల కాపు సంఘం అధ్యక్షుడు చిన మిల్లి వెంకట్రాయుడు, మండల కాపు సంఘం అధ్యక్షుడు నామా ప్రకాశం, పార్టీ కొవ్వూరు మండల కన్వీనర్ సుంకర సత్యనారాయణ, భీమ శంకరం తదితరులు కన్నబాబును కలిసి పుష్ప గుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు.

కోడిగుడ్ల లారీ బోల్తా



గోపాలపురం బైపాస్ రోడ్డులో బోల్తా పడిన లారీ

గోపాలపురం: స్థానిక బైపాస్ రోడ్డులో లారీ బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ గాయపడ్డాడు. హైదరాబాద్ నుంచి భువనేశ్వర్‌కు కోడిగుడ్ల లోడుతో వెళుతున్న లారీ ఆదివారం గోపాలపురం పెద్దగూడెం వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి బోల్తా పడింది. ఈ క్రమంలో పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఆ స్తంభం నేల కూలింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ తలకు గాయమైంది. విద్యుత్ వైర్లు తెగకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి సమస్యలు సత్వరం పరిష్కరించండి

- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు
- చిడిపి అభివృద్ధిపై చిన్నచూపు : సర్పంచ్ ఆవేదన



సమావేశంలో నిధుల కేటాయింపుపై ఎమ్మెల్యేని ప్రశ్నిస్తున్న సర్పంచ్ లక్ష్మణరావు,ఎంపీటీసీ సభ్యుడు అప్పారావు

కొవ్వూరు: వేసవి ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సూచించారు. ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ(నారాయుడు) అధ్యక్షత ఆదివారం మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. దొమ్మేరులో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ సభ్యుడు యలమర్తి రాంబాబు కోరారు. తాగునీటి సరఫరా బోరు వేయాల్సి ఉందన్నారు. దొమ్మేరు సావరం లోను తాగునీటి ఎద్దడితో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని జెడ్పీటీసీ సభ్యురాలు బొంత వెంకటలక్ష్మి వాపోయారు. త్వరితగతిన బోరు పనులు పూర్తి చేయించి తాగునీటిని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఎక్స్ అఫిసియో సభ్యుడిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి పనులను వివరించారు. అజెండాలో పేర్కొన్న అంశాలకు, అభివృద్ధి పనులకు సమావేశం ఆమోదం తెలిపింది. శాఖల వారీగా అధికారులు తమ శాఖల పురోగతిని సమావేశానికి వివరించారు. వైస్ ఎంపీపీ వీరమళ్ల నారాయుడు, ఎంపీడీవో కె.సుశీల, తహసీల్దార్ ఎం.దుర్గా ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఇప్పటికైనా నిధులు మంజూరు చేస్తారా?

చిడిపి గ్రామాభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించడం లేదని సర్పంచ్ పాలగుడుల లక్ష్మణరావు ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామానికి మండల పరిషత్, జిల్లా పరిషత్‌ల నుంచి గానీ ఎమ్మెల్యే, ఎంపీల నుంచి నిధులు కేటాయింపు ఉండడం లేదన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయన వ్యాఖ్యాలను అడ్డుకున్నారు. తాను నిధులు అడగడం పొరబాటు అంటారా అని సర్పంచ్ ఆవేదన వ్యక్త పరిచారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలనలో మా గ్రామానికి నిధులు రాలేదు. కూటమి ప్రభుత్వంలోనైనా వస్తాయని ఆశించామని, ఇంత వరకు ఏ ఒక్క పనిచేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్‌గా నాలుగేళ్ల పదవీకాలం పూర్తయ్యిందని, ఈ చివరి ఏడాదైనా తమ గ్రామానికి తగిన న్యాయం చేయాలని ఆయన కోరారు. పలుమార్లు సర్పంచ్ సమావేశంలో నిలబడి మాట్లాడే ప్రయత్నం చేసినప్పటికీ ఎమ్మెల్యే ఆయన్ను పూర్తి స్థాయిలో మాట్లాడనిచ్చే అవకాశం కల్పించలేదు. ఎంపీటీసీ సభ్యుడు నడింపల్లి అప్పారావు సైతం తమ గ్రామాభివృద్ధి నిధులు కేటాయించాలని కోరారు. నిధులు తీసుకుని రావడంలో తాను ముందుంటానని,విడతల వారీగా నిధులు కేటాయిస్తామని ఎమ్మెల్యే సూచించారు.

వైభవంగా షిర్డీ సాయి మందిర వార్షికోత్సవాలు

నల్లజర్ల: అనంతపల్లిలో షిర్డీ సాయి మందిర 27వ వార్షికోత్సవం వైభవంగా జరుగుతోంది. వేడుకల్లో రెండో రోజైన ఆదివారం భక్తులు హనుమాన్ చాలీసాను 108 సార్లు పారాయణ చేశారు. అధిక సంఖ్యలో షిర్డీ సాయిబాబాను దర్శించుకున్నారు. వేద పండితుడు సూరవరపు అచ్యుత రామయ్య ఆధ్వర్యాన విఘ్నేశ్వర పూజ, బాబాకు అభిషేకాలు, అఖండ దీపారాధన, మధ్యాహ్న హారతి, సంధ్యా హారతి కార్యక్రమాలు నిర్వహించారు. తాడేపల్లిగూడేనికి చెందిన ప్రతాప సాయి శర్మ, గోవిందలూరి సత్యనారాయణశాస్త్రి ఆధ్వర్యాన గణపతి పూజ, పుణ్యాహ వాచనం, దీక్షధారణ, మండపారాధన అనంతరం హోమం నిర్వహించారు. ఉత్సవాల మూడో రోజైన సోమవారం సర్వతోభద్ర మండలార్చన, 108 కలశాలతో జీవనదుల పుష్కర జలం, విశేష ద్రవ్యాలతో బాబాకు ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

గౌడల ఆత్మగౌరవం పెంచే దిశగా కార్యాచరణ



కొవ్వూరులో సమావేశమైన గౌడ సంఘం నాయకులు

కొవ్వూరు: గౌడల ఆత్మ గౌరవాన్ని పెంపొందించేలా సంఘాల నిర్మాణం క్షేత్ర స్థాయిలో నుంచి నిర్వహించేందుకు కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని రాష్ట్ర గౌడ సంఘం ఎగ్జిక్యూటివ్ అధ్యక్షుడు తాతా కృష్ణారావు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఆయన స్వగృహంలో జిల్లాలో ఏడు నియోజకవర్గాలకు చెందిన సంఘం అధ్యక్షులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఇటీవల జిల్లా, నియోజకవర్గ స్థాయిలో కమిటీల ఏర్పాటు పూర్తి చేసినందున మండల, గ్రామ స్థాయిలో కమిటీల నియామకంపై దృష్టి సారించినట్టు ప్రకటించారు. గౌడ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శాస్త్రవేత్త సన్నిబాబు, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ అధ్యక్షుడు కృష్ణారావు మాట్లాడుతూ గౌడ సామాజిక వర్గం రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా అధ్యక్షుడు మార్గాని సత్యనారాయణ, బుడ్డిగ అప్పారావు, రేలంగి వీర వెంకట సత్యనారాయణ, బొర్రా కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి



నిడదవోలు పట్టణంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు



తాళ్లపూడిలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు

నిడదవోలు: రాష్ట్రం కోసం అమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు త్యాగాలు మరువలేమని మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు అన్నారు. పట్టణంలో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, పట్టణ కార్యదర్శి గాజుల రంగారావు, నాయకులు కామిశెట్టి సత్యనారాయణ, వులగన పొలయ్య, ఆలమూరి రాజశేఖర్, గోపిరెడ్డి శ్రీనివాస్, ఆలమూరి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దేర్గేష్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను దేవరపల్లిలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి సంఘం ప్రతినిధులు నివాళి అర్పించారు. కార్యక్రమంలో వాసవి జాగృతి అంతర్జాతీయ డిస్ట్రిక్ట్ గవర్నర్ శ్రీకాకొళపు కాశీకృష్ణ, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్తగుండ బాబూరావు, పంచాయతీ ఉపసర్పంచ్ వెలగా సాంబశివరావు, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు సుతాపల్లి రామారావు, నూలు రమణ, కొత్త సత్యనారాయణ, చిరువూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలో ఆదివారం అమర జీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. తాళ్లపూడిలోని బస్టాండ్ సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఆర్యవైస్య సంఘం నాయకులు పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తాళ్లపూడి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు యండపల్లి శేఖర్, గోకవరపు మాణిక్యం, అప్పన జగదీష్, శివ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు

ఉండ్రాజవరం: తెలుగుజాతి కోసం తన ప్రాణాలు అర్పించిన గొప్ప వ్యక్తి పొట్టి శ్రీరాములు అని ఆర్య వైశ్య సేవా సంఘం మాజీ అధ్యక్షుడు కోల్లేపర పుల్లేశ్వరరావు అన్నారు. పాలంగి గ్రామంలో వాసవీ మాత ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రాథమిక పాఠశాల నంబర్ వన్‌లో ఉన్న పొట్టి శ్రీరాములు, గాంధీజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం కార్యదర్శి సింహాద్రి సత్యనారాయణ గుప్త, సభ్యులు పి.పుల్లేశ్వరరావు, తటవర్తి సత్యనారాయణ, నాగవరపు సత్యనారాయణ, నూలు సుబ్బారావు, కోట్ల కాశీ, గమిని కుమార్, ముత్తా రాజేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

గోపాలపురం: స్థానిక దేవరపల్లి రోడ్డులోని లలితాంబికా అమ్మవారి ఆలయ 16వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణకర్త డాక్టర్ బొమ్మారెడ్డి గంగాధర్‌రెడ్డి, రాణి దంపతుల ఆధ్వర్యాన అమ్మవారికి పంచామృతాభిషేకం, సామూహిక కుంకుమ పూజలు, లలితా సహస్ర నామ పారాయణ చేశారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు.

పచ్చని చెట్లపై అక్రమార్కుల వేటు

- పేట్రేగుతున్న పుల్లల మాఫియా
- కాలువ గట్లగా విచ్చలవిడిగా నరికివేత
- పొగాకు బ్యారన్లకు రవాణా
- టన్ను రూ.4,500కు విక్రయం
- రోజుకు 20 టన్నుల రవాణా



దేవరపల్లి వద్ద పోలవరం కుడి కాలువ గట్టుపై రవాణాకు సిద్ధంగా ఉన్న వేపపుల్ల



చెట్లు నరికిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

దేవరపల్లి: మండలంలో పుల్ల మాఫియా రోజురోజుకూ ప్రేటేగిపోతోంది. పోలవరం కుడి కాలువ, తాడిపూడి ఎత్తిపోతల పథకం ప్రధాన కాలువ గట్లను పుల్ల అక్రమ వ్యాపార మాఫియా లక్ష్యంగా చేసుకుంటోంది. గట్లపై ఉన్న పెద్ద పెద్ద చెట్లను నరికేసి, అక్రమంగా తరలించి, లక్షల రూపాయలు సొమ్ము చేసుకుంటోంది. అక్రమార్కుల ధనదాహానికి సుమారు 20 ఏళ్ల నాటి వేప, చింత, ఇతర జాతి వృక్షాలు బలవుతున్నాయి. దాదాపు నాలుగు నెలలుగా కాలువ గట్లపై చెట్లను నరికేసి, పుల్ల మాఫియా దర్జాగా తరలించుకుపోతున్నా ఇరిగేషన్ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదని పలువురు విమర్శిస్తున్నారు. దేవరపల్లి, గోపాలపురం మండలాల్లో ఎక్కువగా కాలువ గట్లపై చెట్లను అక్రమ వ్యాపారులు నరికేసి పుల్లలు అమ్ముకుంటున్నారు. ఈ రెండు మండలాల్లో ప్రతి రోజూ సుమారు 20 లారీల పుల్ల రవాణా జరుగుతున్నట్లు సమాచారం. టన్ను పుల్ల రూ.3,500 నుంచి రూ.4,500కు అమ్ముతున్నారు. తెల్లవారుజామున 4 నుంచి ఉదయం 7 గంటల వరకూ నరికిన పుల్లను సాయంత్రం సమయంలో గుట్టు చప్పుడు కాకుండా పొగాకు బ్యారన్లు, ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. చెట్ల నరికివేయడం వల్ల కాలువ గట్లు బలహీనపడి వర్షాకాలంలో కోతకు గురవుతున్నాయని ప్రజలు అంటున్నారు. దేవరపల్లి - దుద్దుకూరు రోడ్డులోని పోలవరం కుడి కాలువ గట్టుపై ఆదివారం వేపచెట్లు నరుకుతూండగా పంచాయతీ సిబ్బంది అడ్డుకుని, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు కాలువ గట్టు వద్దకు వెళ్లగా అప్పటికే పుల్ల వ్యాపారులు అక్కడి నుంచి జారుకున్నారు. అక్కడ రవాణాకు సిద్ధంగా ఉన్న పుల్లను స్వాధీనం చేసుకోవాల్సిందిగా పంచాయతీ కార్యదర్శిని తహసీల్దార్ ఆదేశించారు. కాలువ గట్లపై చెట్ల నరికివేతకు సంబంధించి ఆయా అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు.